క్లుప్తంగా

ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు


ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: శ్రీకృష్ణా జన్మాష్టమి పర్వదినాన్ని ప్రజలు సంతోషంగా నిర్వహించుకోవాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆకాంక్షించారు. ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ శ్రీ కృష్ణుని తత్వాన్ని తెలుసుకుని, కలిసిమెలిసి జీవించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కృష్ణాష్టమి శుభాకాంక్షలు

కనిగిరి రూరల్: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రోడ్డు పనులు ప్రారంభం

పీసీపల్లి: మండల పరిధిలోని జంగాలపల్లిలో పోలేరమ్మ గుడి వద్ద నుంచి చెరువుకట్ట వరకు గ్రావెల్ రోడ్డు పనులను సర్పంచ్ నల్లగుంటల శ్రీనివాస్ యాదవ్, ఓబులరెడ్డి, నాగిరెడ్డి , రమణారెడ్డి ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ రోడ్డు పనులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటలో వ్యక్తికి త్రీవ గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మహ్మదాపురం గ్రామానికి చెందిన చింతం బాలవర్దన్‌రాజు బైక్‌పై కనిగిరి వైపు నుంచి స్వగ్రామం మహ్మదాపురం వెళ్తున్నాడు. అదే సమయంలో వేములపాడు వైపు నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో మహ్మదాపురం గ్రామానికి చెందిన బాలవర్దన్‌రాజు కాలు విరిగింది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఒంగోలు తీసుకు వెళ్లారు. రెండో వాహనంపై వచ్చిన వ్యక్తి ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం

టంగుటూరు: గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పూర్తి సమయాన్ని గ్రంథాలయంలో పుస్తకాలు చదవడానికి ఉపయోగిస్తే విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా గ్రంథాలయానికి పంపాలని సూచించారు.

120 మందికి నేత్ర వైద్య పరీక్షలు


కందులూరులో నే6త వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో స్థానిక నాయకుడు డి.బసవయ్య ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణ నేత్రాలయం వైద్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి సొంత ఖర్చులతో కృష్ణ నేత్రాలయం తరపున కంటి చికిత్స చేస్తామని డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మన్నం వెంకయ్య, స్వాములు, దార్ల టైలర్, నేత్రాలయం సిబ్బంది వంశీ, ప్రవీణ్, రమణ, వహీద్, రహిమాన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

ఉలవపాడు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మా కిష్టం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయంలో ఎంతో విలువైన పుస్తకాలు ఉన్నాయని, వాటిని చదవడం ద్వారా ఎంతో విజ్ఞానం సంపాదించవచ్చని తెలిపారు. విద్యార్థులతో నీతికథలు, మహనీయుల చరిత్రలను చదివించారు. ఉలవపాడు గ్రంథాలయానికి అనుబంధంగా ఉన్న చాకిచర్ల బుక్‌కీపింగ్ సెంటర్‌లో కూడా విద్యార్థులతో నీతి కథలు చదివించారు.

డేవిడ్ రాజు మృతికి సంతాపం

కనిగిరి రూరల్: మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ పాలపర్తి డేవిడ్ రాజు మృతికి మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కల్గిన సీనియర్ నేత డేవిడ్ రాజు..అన్ని పక్షాల నేతలతో మంచి సంబంధాలు గడిపారన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



వైద్య సిబ్బంది భద్రత ప్రభుత్వాలదే..

ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి. డాక్టర్లు, వైద్య సిబ్బందిపై ఇటీవల అమానవీయ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలి. అలాగే ఆరోగ్య కేంద్రాల వద్ద రక్షణ కోసం సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో పోలీస్ నిఘా పెట్టాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటన మరోసారి చోటుచేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారించాలి.

– డాక్టర్ రవికిరణ్, పీహెచ్‌సీ, పొన్నలూరు



పోలీస్ పెట్రోలింగ్ తప్పనిసరి

సమాజంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ముఖ్యంగా మహిళలకు భద్రత లేదు. ప్రధానంగా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై మద్యంబాబులు దాడి చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో తాగుబోతుల బెడద ఎక్కువగా ఉంది. పోలీసులు రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తే మంచింది. ఈ దాడులు అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి నిందితులను తక్షణమే శిక్షించాలి.

– డాక్టర్ బాలాజీ అశోక్, టంగుటూరు పీహెచ్‌సీ వైద్యుడు




సింగరాయకొండ : సోమరాజుపల్లి రైల్వే గేటు వద్ద రోడ్డు పక్కన చెత్త


సింగరాయకొండ : చేపల మార్కెట్ వద్ద రోడ్డు పక్కన వ్యర్థాలు


సింగరాయకొండ : ఊళ్లపాలెంలో రోడ్డు పక్కన కొబ్బరి బొండాలు


టంగుటూరులోని వాణీ నగర్‌లో గృహాల మధ్య మురుగు

అబ్బో.. గబ్బు!

- గ్రామాల్లో దారుణంగా పారిశుధ్యం
- ప్రజలపై దండయాత్ర చేస్తున్న దోమలు
- ఆస్పత్రుల పాలై ఆర్థికంగా చితికిపోతున్న జనం


సింగరాయకొండ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితురాలు

సింగరాయకొండ/టంగుటూరు/మర్రిపూడి: దోమలపై దండయాత్ర చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ప్రకటన నోటి మాటకే పరిమితమైంది. ప్రతి మంగళవారం వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం బ్లీచ్ పౌడర్ కొనేందుకు కూడా డబ్బులు లేవంటూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిందారోపణలు చేయడానికే మొగ్గు చూపుతోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కే నాటికే రాష్ట్ర ఖజానాలో రూ.7 వేల కోట్ల నిధులున్నా గత రెండున్నర నెలలుగా గ్రామ పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపిన దాఖలాల్లేవు. కూటమి మంత్రులు, ప్రజాప్రతినిధులు ఉద్దేశపూర్వకంగా అరుస్తున్న బీద అరుపులు రోగాలపాలై ఆస్పత్రుల్లో ఉన్న ప్రజలను మరింత ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి.

వాణిజ్య కేంద్రమైన సింగరాయకొండ పట్టణంతోపాటు గ్రామాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దోమల ఆవాస కేంద్రాలుగా తయారయ్యాయి. టంగుటూరు మండలంలో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. పొందూరు పంచాయతీలో మన ఊరు మన పరిశుభ్రత, చెత్త వేస్తే జరిమానా రూ.500 అని బోర్డు పెట్టిన ప్రదేశంలో మురుగు, చెత్త దర్శనమిస్తూ అధికారుల తీరును వెక్కిరిస్తున్నాయి. జమ్ములపాలెంలో గృహాల మధ్యనే మురుగు ప్రవహిస్తున్నా, టంగుటూరు సెంటర్లో నడి రోడ్డుపై చెత్త వేస్తున్నా, వాణీ నగర్‌లో గృహాల మధ్య మురుగు నిలిచి ఉన్నా అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. మర్రిపూడి మండలంలోని గార్లపేట, మర్రిపూడి, వేమవరం, వెంకటకృష్ణాపురం, అయ్యపురాజుపాలెం, తంగెళ్ల, రామాయపాలెం పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది.

పెరిగిన జ్వరాల తీవ్రత

కొండపి నియోజకవర్గంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, ఫ్లూజ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పీహెచ్‌సీలకు రోజూ 20 నుంచి 30 మంది వరకు జ్వర పీడితులు వస్తున్నట్లు వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇటీవల సింగరాయకొండలోని మూలగుంటపాడు, బైరాగిమాన్యం, బాలయోగినగర్, కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల బీసీ కాలనీ, పాతసింగరాయకొండ పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రజలు డెంగీ బారిన పడి చికిత్స పొందారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సింగరాయకొండ పీహెచ్‌సీలో రక్త పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు


టంగుటూరు : జమ్ములపాలెంలో ఇళ్ల మధ్య మురుగు


తంగెళ్లలో వ్యర్థాలతో పూడిపోయిన డ్రెయినేజీ


సింగరాయకొండ : బాలయోగినగర్‌లో పేరుకు పోయిన మురుగునీరు

ఉత్సాహంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


బాబా గుడిలో ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సీఎస్‌పురం(పామూరు): శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల హెచ్‌ఎం దారపనేని చెన్నకేశవులు, పీఎంసీ ఎస్ఎంసీ చైర్మన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపిక వేషధారణలో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు నిర్వహించిన కోలాటం ప్రత్యేకతను సంతరించుకుంది. ముందస్తు వేడుకల అనంతరం విద్యార్థులు మిఠాయిలు పంచిపెట్టారు.


గోపిక, కృష్ణుల వేషధారణలో చిన్నారులు


చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని స్మార్ట్‌జెన్ గ్లోబల్ స్కూల్లో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ పి.గీతారాణి పండగ విశేషాలను విద్యార్థులకు వివరించారు.

కృష్ణా ముకుందా మురారి

కనిగిరి రూరల్: పట్టణంలోని శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆల్ఫా, మదర్స్ తదితర పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థులు చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించారు. అలాగే పరాశర భారతీ స్కూల్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, కనిగిరి బ్రహ్మణ సంఘ మాజీ అధ్యక్షుడు మాచవరం సుబ్రహ్మణ్యం దంపతులు పాల్గొన్నారు.

స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 6 గంటలకు సామూహిక పూజలు జరుగుతాయన్నారు. విష్ణు సహస్రనామ పారాయణం, సహస్ర నామార్చాన, 108 రకాల ప్రసాదాలు స్వామికి సమర్పణ, చిన్నారులతో గోపిక, కృష్ణుల వేషధారణలు, భక్తుల కోలాట భజన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు తెలిపారు. అలాగే దేవాంగనగర్‌లో శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా సోమవారం సాయంత్ర 6 గంటలకు 12 ఏళ్ల లోపు బాల బాలికలకు శ్రీకృష్ణ, గోపికల వేషధారణల పోటీలు నిర్వహించి విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

తూతూమంత్రంగా గ్రామసభలు

- వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్


దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించి వాటి గురించి గొప్పలు చెప్పుకుంటున్నారని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లను ప్రోటోకాల్ ప్రకారం పిలువ లేదని ఆరోపించారు. కూటమి నాయకులు అధికారులను బెదిరిస్తున్నారన్నారు. తాము చెప్పినట్లు వినకుంటే బదిలీ చేయిస్తామని అధికారులను బెదిరించడం సరైంది కాదన్నారు. అనేక చోట్ల గ్రామసభలు రాజకీయ వేదికలుగా మారాయాని ఘాటుగా విమర్శించారు. చాలా ప్రాంతాల్లో గ్రామస్థాయిలో ప్రజల నుంచి సరైన స్పందన కరువవ్వడంతో మమ అనిపించారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామసభల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి నోరు విప్పడం లేదంటూ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందుకు ప్రజలకు చెప్పిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించం


సింగరాయకొండ-రైల్వేస్టేషన్ రోడ్డులో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న సీఐ

సింగరాయకొండ: ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చిరువ్యాపారులు నిబంధనల ప్రకారం వ్యాపారాలు నిర్వహించుకోవాలని సీఐ సీహెచ్ హజరత్తయ్య సూచించారు. మండల కేంద్రంలో మెయిన్‌రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం సాయంత్రం సీఐ పర్యటించారు. సీఐ మాట్లాడుతూ చిరు వ్యాపారులు వారికి సూచించిన ప్రకారం బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఎస్సై బి.మహేంద్ర, ఎస్సై షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలతో గోపూజ నిర్వహించారు. వేకువజామున నారాయణస్వామి మూలవిగ్రహ మూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, మాజీ ఎంపీటీసీ ఆలా తిరుపతయ్య, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో తాగునీటి కష్టాలు

- పంచాయతీ నిర్లక్ష్యంతో మూతపడిన వాటర్‌ప్లాంట్


మూతపడిన ఉలవపాడులోని కొత్తూరు వాటర్‌ప్లాంట్

ఉలవపాడు: గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ఉలవపాడులోని కొత్తూరులో వాటర్ ప్లాంట్ మూతపడింది. గ్రామపంచాయతీ, గ్రామీణనీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నడిచే ఈ వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు గురైందనే కారణంగా మూసివేశారనుకుంటే పొరపాటే. కేవలం నీరుపట్టుకోవడానికి పెట్టే కార్డు మిషన్ పనిచేయడం లేదని ప్లాంటును మూత వేశారు. చిన్నరిపేరు కోసం దాదాపు 20 రోజుల నుంచి ప్లాంట్‌ను మూసేశారు. ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.6 లక్షలతో ఈ వాటర్‌ప్లాంట్‌ను నిర్మించారు. కొత్తూరు ప్రాంతంలోని అందరూ దాదాపు ఈ ప్లాంట్ నుంచే తాగడానికి నీరు తీసుకువెళ్తారు. కాలనీవాసులు వచ్చి కార్డు పెడితే డబ్బులు అకౌంట్ నుంచి పోతున్నాయి కానీ నీరు రావడం లేదు. ఇదేమని అడిగితే కార్డు పెట్టే మిషన్ చెడిపోయిందని చెప్పి ఆ తరువాత ప్లాంట్‌ను మూత వేశారు. కొందరు తెలియని వ్యక్తులు వచ్చి నగదు వేసి పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంత వార్డు మెంబరు మహంకాళి భీమయ్య సైతం పలుమార్లు అధికారులకు తెలియచేసినా ఫలితం శూన్యం. 20 రోజులుగా వాటర్ ప్లాంట్ పనిచేయక పోయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. వెంటనే ప్లాంట్ కార్డు మిషన్‌ను రిపేరు చేసి ప్రజలకుమినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందుబాటులోకి తీసుకుని రావాలని కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం


సీఐతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ: శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయిని సమూలంగా లేకుండా చేసేందుకు వ్యాపారులతో పాటు వినియోగదారులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. చెడు ప్రవర్తన కలిగిన వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటామని, ప్రవర్తన మారకపోతే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. పేకాట, క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సైలు షేక్ మహబూబ్‌బాషా, షేక్ మహబూబ్ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.


బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

టంగుటూరు: బహిహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం టంగుటూరు పరిసరాల్లో రహదారుల వెంట, జాతీయ రహదారి సర్వీసు రోడ్లపై మద్యం సేవిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై మాట్లాడుతూ.. జనం సంచరించే ప్రదేశాల్లో మద్యం తాగి గొడవలు పడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కనులపండువగా పోలేరమ్మ తిరునాళ్ల

పామూరు: పామూరులో గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా అర్చకులు పోలేరమ్మ మూల విగ్రహ మూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. భక్తులు పోలేరమ్మ ఉత్సవమూర్తిని ఉత్సవంగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పోలేరమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయానికి చేర్చారు. అనంతరం ఆలయంవద్ద పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ పసుపులేటి రఘురాం, నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ఇర్రి కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, డీవీ మనోహర్, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, పాల్గొన్నారు.

సీఐ ఖాజావలికి సన్మానం


సీఐని సన్మానిస్తున్న చైర్మన్ గఫార్, బీసీ నాయకులు

కనిగిరి రూరల్: కనిగిరి సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కే ఖాజావలిని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ బీసీ సంఘాలు, పట్టణ ప్రముఖులు స్థానిక కార్యాలయంలో ఆదివారం కలిశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, న్యాయవాది ఎస్‌కే సుమైర్(హన్ను), బీసీ ఐక్యవేదిక నాయకులు సీఐ ఖాజావలిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు. బీసీ ఐక్యవేదిక నాయకులు పల్లా మాలకొండయ్య, ఈర్ల విజయ రామరాజు, బాబా హిమామ్, బొప్పరాజు, చింతలపూడి వాసు, పట్నం నరసింహులు, కోమటిగుంట్ల బాబురావు, గడ్డి నర్సింహులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌కే అబ్దుల్

కనిగిరి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ.. విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ ఎనలేని పోరాటాలు చేస్తోందని యూటీఎఫ్ జిల్లా విభాగం కన్వీనర్ ఎస్‌కే అబ్దుల్ అన్నారు. ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తోందన్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి టి.రమణారెడ్డి, ఎస్‌కే ఖాజా రంతుల్లా, ఎం రాము, బి.మల్లికార్జున, పట్నం నరసింహ, కేవీ బాలకృష్ణ, షాహీద్, జి.స్వప్న, జి.సుబ్బరత్నమ్మ, ఎస్‌కే బషీరున్నీసా, కవిత, కల్పన, రాఘవచారి, షరీఫ్, నాయబ్ రసూల్, జిలానీ, ఆరు మండలాల యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

పట్టు జారితే..ప్రాణాలు పైకే..


విద్యుత్ పోల్స్‌పై చిటారు భాగంలో విద్యుత్ కార్మికులు

కనిగిరి రూరల్: ఊరు కానీ ఊరు.. రాష్ట్రం కానీ రాష్ట్రం నుంచి వచ్చి పొట్ట కూటికోసం ఎన్నో కష్టాలు పడుతూ కన్పించారు కార్మికులు. పట్టణంలో జరుగుతున్న విద్యుత్ మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటుకు వచ్చిన కార్మికులు సుమారు 25 అడుగుల ఎత్తు, 40 అడుగుల ఎత్తు ఉన్న పోల్స్‌పై చిటారు భాగంలో రాడ్లపై ఎటువంటి అధారాలు లేకుండా నిలబడి పనులు చేశారు. ఈ దృశ్యాలు చూపరుల గుండెలు గుభేల్ అనిపించేలా కన్పించాయి.. పట్టణ ప్రజలు వీరి పనితనాన్ని, ధైర్యాన్ని మెచ్చుకుంటూనే.. పట్టు జారితే వీరి పరిస్థితి ఏంటంటూ ఆందోళనను సైతం వ్యక్తం చేశారు. పట్టణంలోని డిపో రోడ్డు, జూనియర్ కళాశాల రోడ్డులో ఆదివారం వీరు విద్యుత్ పోల్‌పై ఎటువంటి ఆధారం లేకుండా విద్యుత్ స్తంభాలపై పనిచేస్తూ కన్పించారు. ఈ కార్మికులను విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ విభాగం వారు జార్ఖండ్ నుంచి తీసుకొచ్చి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.